క్లుప్తంగా

ప్రారంభమైన నిత్య రుద్రాభిషేకం

కొడంగల్ రూరల్: పట్టణంలోని అతి పురాతనమైన శ్రీజగద్గురు నిరంజన మఠంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీ బసవలింగేశ్వర స్వామివారికి నమక, చమక అధ్యాయాలతో పంచామృతంతో రుద్రాభిషేకం నిర్వహించారు. వీరశైవ సమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి, విశేష అలంకరణ, దూపదీపం, నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ధారూరు: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సర్వీస్, ఆర్థికపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ధారూరు తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని కొనసాగించాలని సూచించారు. అన్ని స్థాయుల ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 5,571 ప్రాథమిక పాఠశాలల హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలన్నారు. 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని, వారికి సొంత జిల్లాలకు సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాంబండ హుండీ లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఆలయ పాలకవర్గం సభ్యులు

కుల్కచర్ల: మండలంలోని పాంబండ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని దేవాలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి హుండీని శ్రావణమాసం ముందు లెక్కించాలన్న నిర్ణయంతో చేపట్టామని తెలిపారు. ఆలయ హుండీ ఆదాయం రూ.1,46,255 సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలనర్సయ్య, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, సాంబశివ సేవ సమితి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పాయిపల్లిలో టీబీ ముక్త్ అభియాన్



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు పలు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీబీ వ్యాధికి చికిత్స తీసుకోవడంతో తగ్గుముఖం పడుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యాదమ్మ, వెంకటయ్య, గోపాల్, రాజునాయక్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

షాబాద్: వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సింలు, చెన్నయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్‌లో ఏఐజీ హాస్పిటల్స్, ఏపీఎంహెచ్-హెచ్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో లివర్ స్కానింగ్, రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 85 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కిట్లు అందక.. భయం తీరక

గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంతో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిది. రోడ్లు, వీధుల్లో పేరుకుపోయిన దుర్గంధాన్ని తొలగించి ప్రజలకు సచ్ఛమైన వాతావరణాన్ని అందిస్తారు. మండల పరిధిలో అలాంటి శ్రమజీవులకు విధుల్లో ఉపయోగించే రక్షణ కిట్లు అందడం లేదు.

- పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై నీలినీడలు
- జీపీ సిబ్బందికి రక్షణ కవచాలు కరువు
- పొంచి ఉన్న అనారోగ్యం ముప్పు



దౌల్తాబాద్‌లో చెత్త తరలిస్తున్న పంచాయతీ కార్మికులు

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కరువైంది. కనీస రక్షణ కవచాలు లేకుండా వారితో పనులు చేయిస్తున్నారు. అసలే వానాకాలం.. వ్యర్థాలను తొలగింపు వారు అప్రమత్తతంగా ఉండాలి. గ్లౌజులు, మాస్కులు, సబ్బులు ఇతర కనీస రక్షణ కవచాలను కూడా ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. చాలా నెలలుగా పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, షూస్, సబ్బులు ఇతర లిక్విడ్స్ అందడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు శుభ్రతను అందించేందుకు నిరంతరంగా సేవలందిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు తగిన భద్రత పరికరాలు లేక పనులు చేసేందుకు నిత్యం అవస్థలు పడుతున్నారు.

వ్యాధుల కాలంలోనూ..

నిత్యం వీధుల్లోకి వచ్చే సిబ్బందికి రక్షణ కవచాలు ఉండడంలేదు. వాన, చలి, ఎండ అనే తేడా లేకుండా శ్రమించే కార్మికులకు భద్రత లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యాధుల సమయంలో మురుగు, చెత్త, హానికరమైన వ్యర్థాలతో అంటు వ్యాధులు సోకే అవకాశం ఉంది. భద్రతా పరికరాల లేమి కారణంగా ఇప్పటికే ఎంతో మంది కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారు. అయినా మళ్లీ పనిలో నిమగ్నం కావాల్సి వస్తుంది. ఏటా రెండు జతల యూనిఫాంలు, రెండు జతల షూలు, మాస్కులు, రెయిన్‌కోట్లు, సబ్బులు, శానిటైజర్లు, ఇవ్వాల్సి ఉంది. మోకాళ్ల లోతు బురదలో దిగి దుర్గంధం వ్యాపిస్తున్నప్పటికీ పనులు చేయాల్సిన పరిస్థితి వారిది. బురదలో దిగినప్పుడు తేళ్లు, జెర్రులు, పాములు కరిచే ప్రమాదం ఉంది. డ్రైనేజీలో మురుగు తొలగించే సందర్భంలో మాస్కులు లేకపోవడంతో దుర్వాసనతో కార్మికులకు ఊపిరితిత్తుల సమస్య వచ్చే ఆస్కారం ఉంది. ప్రభుత్వమే స్పందించి రక్షణ కిట్లను అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> పంచాయతీ కార్యదర్శులు తమ జీపీ పరిధుల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల కోసం రక్షణ సామగ్రి సమకూర్చాలని చెప్పాం. అయితే పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. కొన్ని గ్రామాల్లో సొంతంగా కూడా డబ్బులు వెచ్చించి పంచాయతీ కార్యదర్శులు అందించారు. మిగతా వారికి అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



దుద్యాల్: మంజూరు పత్రం అందిస్తున్న అధికారులు, నాయకులు

దుద్యాల్: పేదలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పేదలకు ఓ ఇల్లు సైతం మంజూరు కాలేదన్నారు. కానీ కాంగ్రెస్ సర్కారులో అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో 53 మందికి మంజూరు కాగా 9 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించి, నిర్మాణాలకు ముగ్గు పోశామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, తహసీల్దార్ కిషన్, డీటీ వీరేశ్‌బాబు, ఎంపీఓ సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నాయకులు కృష్ణ, సత్యనారాయణ, చాంద్‌పాషా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చల్లాపూర్‌లో అందజేత

దౌల్తాబాద్: మండలంలోని చల్లాపూర్ గ్రామంలో శుక్రవారం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ శరణయ్య మాట్లాడుతూ.. అర్హులుగా ఉండి నిరుపేదలైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజప్ప, నాయకులు చంద్రశేఖర్, బాల్‌రాజు, మహిపాల్, శ్యామప్ప, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఎంపీడీఓ గ్యామా



మొక్క నాటుతున్న అధికారులు, ఉపాధ్యాయులు, చిన్నారులు

దోమ: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య, విద్యార్థులతో కలిసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం కిష్టాపూర్, దాదాపూర్ కాంప్లెక్స్ పరిధిలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు రివ్యూ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్ ఆన్‌లైన్ ఎంట్రీతో పాటు జీపీ, ఈపీ, ఎఫ్‌పీ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. టాయిలెట్స్, కంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్డులు లేని పాఠశాలలను గుర్తించి నివేదికలను ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, వెంకట్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

దోమ: అధికారులు విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని తపస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంఈఓ వెంకట్‌కు తపస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమస్యలతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎలక్షన్‌లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ బిల్లులు, రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన కులగణనకు సంబంధించిన సీసీఎల్ఎస్ బిల్లులను ప్రభుత్వాలు నేటికి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌సాయి, రాజశేఖర్, పృథ్వీ, మోహన్, వెంకటేశ్, అశోక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'మోడల్'లో మాక్ పోలింగ్



ఓటు వేయడానికి క్యూలో నిలబడిన విద్యార్థులు

బషీరాబాద్: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. పాఠశాల హెడ్‌బాయ్, హెడ్ గర్ల్ ఎంపికకు ప్రిన్సిపాల్ అనీల ఎన్నికలు నిర్వహించింది. అచ్చం ప్రభుత్వం నిర్వహించే పోలింగ్ మాదిరి విద్యార్థులు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాఠశాల హెడ్ బాయ్‌కు ఆరు మంది, హెడ్ గర్ల్‌కు మరో ఆరు మంది పోటీ పడగా పదో తరగతికి చెందిన సందీప్ రెడ్డి హెడ్‌బాయ్‌గా, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రాథోడ్ స్ఫూర్తి హెడ్ గర్ల్‌గా ఎన్నుకున్నారు. ఎన్నికల్లో గెలిచిన వీరిద్దరికీ ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీకాంత్, స్వామినాథ్, నర్సింహ, సంతోష్‌కుమార్, నరేష్, చంద్రశేఖర్, రజినీ, గోపాలక్రిష్ణ, అగ్రనాస్, అనురాధ, జగదాంబ, హరీష్, అనిల్, మహేష్, నాగరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీల నిర్వహణపై శిక్షణ

బొంరాస్‌పేట: పాఠశాలల్లో ఏర్పాటు చేసిన లైబ్రరీలు ఉపాధ్యాయులతో సమానమని, జీవితాలను మార్చేస్తాయని ఎంఈఓ హరిలాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండో రోజు కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఇందులో ఉపాధ్యాయులకు పాఠశాలల్లో లైబ్రరీల నిర్వహణ, వాటి ఉపయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో లైబ్రరీలను ఉపాధ్యాయులు పునరుద్ధరించాలన్నారు. పాఠశాలల వారీగా ఉపాధ్యాయులను లైబ్రరీల నిర్వహణపై సమీక్షించారు. సలహాలు, సూచలను తీసుకున్నారు. గదుల కొరతను తీర్చి ప్రత్యేకంగా లైబ్రరీలుండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు సీహెచ్ఎం రవీందర్‌గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరు వర్షం.. పంటలకు నష్టం



నాగారంలో ఒరిగిన మొక్కజొన్న పంట

ధారూరు: మండలంలో శుక్రవారం 16.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నిత్యం కురుస్తున్న వానలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లోతట్టు పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో పంటలు పాడయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. వర్షపు నీరు పంట పొలాల గుండా ప్రవహించడంతో మొక్కలు ఒరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



నాగిరెడ్డిపల్లిలో పరిశీలిస్తున్న పీడీ కృష్ణయ్య

బొంరాస్‌పేట: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య సూచించారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ఆయన శుక్రవారం పర్యటించారు. గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలన చేశారు. గ్రామంలో 97 ఇళ్లు మంజూరుకాగా 26 ఇళ్లు లెంటల్, పైకప్పు దశలో ఉన్నాయని తేలింది. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటి వరకు బేస్మెంట్, లెంటల్ దశ బిల్లులు అందాయన్నారు. పనులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ చందర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూర్పు భీములు అన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కర్నకోట మాధవికి రూ.లక్ష, బుక్క సలీమ్ రూ.50 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇంట్లో పెద్ద కొడుకులాగా ఆసుపత్రుల ఖర్చులు అందిస్తూ వారి ప్రాణాలు కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

పరిగి: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. పురపాలక సంఘం వంద రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని ప్రేమ్‌నగర్ కాలనీలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేయాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతోనే ఎలాంటి రోగాల దరి చేరవన్నారు. నిత్యం పారిశుద్ధ్య కార్మికులు కాలనీలోని వీధులను శుభ్రం చేస్తున్నప్పటికీ ప్రజలు సైతం వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ్, మెప్మా సీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలి



బహిరంగసభకు తరలిన నాయకులు

కొడంగల్ రూరల్: మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని మున్నూరు కాపులు చలో వేములవాడకు తరలివెళ్లారు. అక్కడ రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకొని అనంతరం బహిరంగసభలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మున్నూరుకాపులు ఐకమత్యంగా సత్తా చాటాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పురుషోత్తం సూచించినట్లు నాయకులు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కోశాధికారి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు అనంత ప్రసాద్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేష్ కుమార్, ఓంప్రకాష్, బిచ్చప్ప, శ్యాంసుందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలా.. యమపాశాలా?



చేతికి అందుతున్న విద్యుత్ తీగలు

దుద్యాల్: మండల పరిధిలోని సంత్రకుంట తండాలో విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. పొలాలకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ తీగలు మనిషి నెత్తికి తాకేంత ఎత్తులో వేలాడుతున్నాయి. ఒక తీగకు మరొక తీగ తగలకుండా కట్టెను సపోర్టుగా బిగించి తండావాసులు కాలం వెళ్లదీస్తున్నారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సరి చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వర్షాకాలం కావడంతో గాలి తీవ్రతకు తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు సంభవించే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సర్కారు బడిలో మెరుగైన విద్య



పెద్దేముల్ బాలుర పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ నర్సింగ్‌రావు



కుల్కచర్ల: మాట్లాడుతున్న ఎంఈఓ హబీబ్ అహ్మద్

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. గ్రంథాలయ ఆవశ్యకతను వివరించి పుస్తకాలు చదివే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం పెద్దేముల్ బాలుర పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సునీత, బోజప్ప, సీఆర్పీలు నర్సిరెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలు ఉపయోగించాలి

కుల్కచర్ల: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ముజాహిద్‌పూర్ గ్రామంలో క్లస్టర్ ఉపాధ్యాయ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనోపకరణాలను ఉపయోగిస్తూ పాఠాలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి, సీఆర్పీ రాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేద్దాం

చేవెళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చామని ఈకార్యక్రమాన్ని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్‌పే చెల్లించాలన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వలస కార్మికులతో వెట్టి చాకిరి

మొయినాబాద్: వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న మసాలా కంపెనీపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అమ్డాపూర్ రెవెన్యూలో పరిధిలో ఉన్న బాలాజీ మసాలా కంపెనీని సీఐటీయూ నాయకులు సందర్శించి వలస కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలాజీ మసాలా కంపెనీ యాజమాన్యం వలస కార్మికుల శ్రమను దోచుకుంటోందన్నారు. నిబంధనలు పాటించకుండా తక్కువ జీతాలు ఇస్తూ కార్మికులతో 12–14 గంటలు పనిచేయిస్తున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా కార్మికులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

అసంపూర్తి రోడ్లు.. చోదకుల పాట్లు



కంకర పోసి వదిలేసిన హస్నాబాద్-నీటూర్ రోడ్డు

దుద్యాల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్ని ఛిద్రం అవుతున్నాయి. మండల పరిధిలో దాదాపు అన్ని గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు గతేడాది నుంచి సాగుతున్నాయి. నేటికీ రోడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని కుదురుమల్ల నుంచి దాదాపూర్ వరకు, హస్నాబాద్ నుంచి నీటూర్ గేట్, దుద్యాల్ నుంచి లింగంపల్లి గేట్, లగచర్ల నుంచి గౌరారం, దుద్యాల్ నుంచి హస్నాబాద్, పులిచర్లకుంటతండా ఇలా అనేక గ్రామాలకు రోడ్డు పనులు సాగుతున్నాయి. వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నా కాంట్రాక్టర్లు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడికక్కడ అసంపూర్తి రోడ్లే దర్శనమిస్తున్నారు. ఈ వానలకు అస్తవ్యస్త రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికై నా రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.